క్లుప్తంగా

అల్లాదుర్గంను రెవెన్యూ డివిజన్ చేయాలి


కొనసాగుతున్న రిలే దీక్షలు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలాన్ని ప్రభుత్వం రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ చిల్వెర ఐబీ చౌరస్తాలో అల్లాదుర్గం రెవెన్యూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 35 రోజుకు చేరుకున్నాయి. రెవెన్యూ డివిజన్‌తోపాటు ఆరోగ్య కేంద్రాన్ని వందల పడకల ఆసుపత్రిగా, ఇతర ప్రాంతంలో నడుపుతున్న అల్లాదుర్గం బీసీ గురుకుల పాఠశాలను అల్లాదుర్గంలోనే కొనసాగించాలని ఆందోళన కారులు నినాదాలు చేశారు. ఎస్టీఓ కార్యాలయం లేక ఈ ప్రాంత ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు.

దళిత బంధుతో చేయూత


దళిత బంధు లబ్ధిదారు ఎంపిక గ్రామసభ

కౌల్పారం(నర్సాపూర్): దళితులకు దళిత బంధు పథకంతో ప్రభుత్వం చేయూతనందించడం హర్షించదగ్గ విషయమని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, ఏటిగడ్డ మాందాపూర్ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో దళిత బంధు లబ్ధిదారుల ఎంపికపై గ్రామసభ నిర్వహించారు. గ్రామానికి మూడు యూనిట్ కేటాయించడంతో అందరి సమన్వయంతో లబ్ధిదారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అంజు మునిసా, గ్రామస్తులు పాల్గొన్నారు.

రసాభాసగా గ్రామ సభలు

శివ్వంపేట(నర్సాపూర్): దళితబంధు లబ్ధిదారుల ఎంపికకు శుక్రవారం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. దొంతి గ్రామంలో రెండు వందలకుపైగా దళిత కుటుంబాలు ఉంటే 13 మందికి మంజూరైనట్లు అధికారులు చెప్పడంతో దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో 262 దళిత కుటుంబాలు ఉన్నాయని అందరికీ దళితబంధు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. కొంత మందికి ఇచ్చి గొడవలు సృష్టించొద్దన్నారు. మరికొన్ని గ్రామాల్లో మంజూరైన కొద్దిపాటి దళితబంధు యూనిట్లను అందరు తీసుకునేలా చర్చకు రావడంతో దళితులు ఒప్పుకోలేదు. ఒకరి పేరిట మంజూరైన రూ.10 లక్షల దళిత బంధు నిధులను అందరు కలిసి తీసుకోవాలంటూ ప్రస్తావించడంతో మండిపడ్డారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని ప్రకటించాలి

నర్సాపూర్: నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థిని ప్రకటించాలని ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి పార్టీ అధిష్టానాన్ని కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులకు ప్రకటించి నర్సాపూర్‌కు ప్రకటించకపోవడంతో పార్టీ కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి సైతం కుంటుపడుతుందని చెప్పారు. అన్ని స్థానాల మాదిరిగా నర్సాపూర్ అభ్యర్థిని ప్రకటిస్తే క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యక్రమాలు చేపట్టేదుకు వీలుంటుందన్నారు. నర్సాపూర్ అభ్యర్థిని ప్రకటించేందుకు జిల్లా మంత్రి హరీశ్ రావు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఖోఖోలో ప్రథమ బహుమతి

కౌడిపల్లి(నర్సాపూర్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల్లో కౌడిపల్లి మండల ఖోఖో జట్టుకు జిల్లా ప్రథమ బహుమతి వచ్చినట్లు పీడీలు రమేశ్, రాజన్న శుక్రవారం తెలిపారు. మెదక్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలలో అండర్ 14 విభాగంలో జరిగిన ఖోఖోలో మండలంలోని వివిధ గురుకుల, ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చడంతో ప్రథమ బహుమతి వచ్చినట్లు చెప్పారు. విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు రాజేందర్, మహిపాల్ తదితరులు అభినందించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు మార్షల్ ఆర్ట్స్ దోహదపడతాయని సోమక్కపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విఠల్ అన్నారు. మండలంలోని సోమక్కపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శృతి, దీపిక, శ్రీవాణి వారియర్ మార్షల్ ఆర్ట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో వారికి శుక్రవారం పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. సంగారెడ్డిలో వారియర్ మార్షల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బెల్ట్ ఎక్జామ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో కుంగ్ ఫూ మాస్టర్ నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం కృషి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

నర్సాపూర్: రాష్ట్రంలో విద్యా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. తన భర్త దివంగత వాకిటి లక్ష్మారెడ్డి మెమోరియల్ అండ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం గురు పూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ మన ఊరు మన బడి కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వ పాఠశాలల భవనాలు బాగుచేయించడంతోపాటు వసతులు కల్పించారన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు అల్పాహారం అందచేసే కార్యక్రమాన్ని ప్రకటించారని, త్వరలో ప్రారంభించే అవకాశం ఉందన్నారు. అలాగే ఉపాధ్యాయులకు మేలు జరిగే విధంగా ప్రభుత్వం పీఆర్‌సీని ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చానాయక్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు నయిమొద్దీన్, శివశంకర్ రావు, భోగేశ్వర్, సంధ్యారాణి, సత్యంగౌడ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, భిక్షపతిగౌడ్, శ్రీరాములు, పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు సామ్యానాయక్, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులను ట్రస్టు ఆధ్వర్యంలో సన్మానించారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

కౌల్పారం(నర్సాపూర్): ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతా రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అంసాన్‌పల్లికి చెందిన ప్రభాకర్‌కు రూ.36 వేలు, అప్పాజిపల్లి గ్రామానికి చెందిన మొగులమ్మకు రూ.22 వేలు ప్రభుత్వం చెక్కుల రూపంలో సీఎంఆర్‌ఎఫ్ మంజూరు చేసింది. ఈ చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్, నరేందర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, యాదయ్య, వేమారెడ్డి, చలం యాదగిరి, సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.



ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం


సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మెప్మా ఉద్యోగులు

మెదక్ మున్సిపాలిటీ: ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ మెప్మా ఉద్యోగస్తులకు వేతనాలు పెంచిన సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మెప్మా ఉద్యోగులకు రూ.4వేల వేతనం ఉండగా వారి శ్రమను గుర్తించి రూ.6 వేలకు పెంచారన్నారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, మెదక్ మున్సిపల్ మెప్మా ఉద్యోగులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

హవేళిఘనాపూర్ మండల పరిధిలోని గాజిరెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధికి పట్టం కట్టేందుకు ప్రజలు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ విభాగంలో నూతన నియామకం

రామాయంపేట(మెదక్): బీఆర్ఎస్ మైనార్టీ విభాగం మండల ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన జమీర్, ప్రధాన కార్యదర్శిగా గౌస్ నియమితులయ్యారు. శుక్రవారం వీరికి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు సరాపు యాదగిరి, చల్మెడ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అహ్మద్ పాల్గొన్నారు.

ప్రగతి పథంలో గ్రామాలు

జెడ్పీ చైర్ పర్సన్ ర్యాకల హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): సీఎం కేసీఆర్ కృషితో ప్రతీ గ్రామం అభివృద్ధి పథంలోకి దూసుకెళ్లాయని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో దండుపల్లి గ్రామ పంచాయతీ ప్రహరీ నిర్మాణానికి రూ 5 లక్షల జెడ్పీ నిధుల ప్రొసీడింగ్ పత్రాలను ప్రజాప్రతినిధులకు అందజేశారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తుకు చేసుకున్న 12 మందికి రూ.3.52 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు మొగ్గుచూపాలి

వెల్దుర్తి(తూప్రాన్): ఆయిల్ పామ్ సాగుకు రైతులు మొగ్గుచూపాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ సూచించారు. మాసాయిపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్ పామ్ సాగుతో నిరంతర దిగుబడితోపాటు రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాడన్నారు. మొక్కలు నాటిన తర్వాత నాలుగేళ్ల నుంచి కాపు మొదలై 30 ఏళ్ల వరకు దిగుబడితో నిరంతరం ఆదాయం లభిస్తుందన్నారు. రైతులు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, ఏఈఓ రజిత, సెక్రటరీ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించాలి

తూప్రాన్: హెల్ప్ ఏజ్ ఇండియా వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం వృద్ధులతో కలిసి మున్సిపల్ పరిధిలోని పడాలపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్ మాట్లాడుతూ వృద్ధుల కోసం నిర్వహిస్తున్న హెల్ప్ ఏజ్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వృద్ధుల పట్ల గౌరవంగా మెలగాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉండే దవాఖానాలకు వెళ్లలేని వృద్ధుల కోసం హెల్ప్ ఏజ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నాలుగు సంవత్సరాలుగా ఉచిత వైద్య సేవలు, మందులను అందజేస్తున్నట్లు ఆ సంస్థ సోషల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మహేష్ తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రవీందర్‌గౌడ్

బగలాముఖీ ఆలయంలో పౌర్ణమి పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తి పీఠంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు, హోమం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ప్రజా ప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏపీటీఐ అధ్యక్షుడు మిలింద్ జె.ఉమేకర్

నర్సాపూర్: ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని శ్రీ విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ రవీంద్రబాబు అన్నారు. నిక వైపర్ కాలేజీలో శుక్రవారం ఏర్పాటు చేసిన కొత్త విద్యార్థుల పరిచయ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఫార్మసీ చదువుతున్న విద్యార్థులు ఫార్మసిస్టులుగానే కాకుండా ఇతర రంగాలలో రాణించవచ్చన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పలువురు ఫార్మా శాస్త్రవేత్తలను ఆయన గుర్తు చేస్తూ కోవిడ్ వ్యాక్సిన్ తయారీలో ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, వైపర్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్, తదితరులు పాల్గొన్నారు. వైపర్ కాలేజీలో శుక్రవారం గ్యాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా (ఏపీటీఐ) అధ్యక్షుడు మిలింద్ జె.ఉమేకర్ మాట్లాడుతూ ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులందరూ జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో వైపర్ కాలేజీ ప్రిన్సిపాల్ తోపాటు పలువురు హెచ్ఓడీలు పాల్గొన్నారు. ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్లతో పాటు మెడల్స్ అందచేశారు.

సంక్షిప్త వార్తలు



◆ కల్తీ మద్యం కేసులో ఇద్దరు బైండోవర్

మనోహరాబాద్(తూప్రాన్): కల్తీ మద్యం కేసులో ఇద్దరిని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు శుక్రవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రెండు రోజులు క్రితం ఎక్సైజ్ అధికారుల తనిఖీలో భాగంగా మండలంలోని కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి పరిశ్రమల వాడ శివారులో కల్తీ మద్యం అమ్ముతున్న మదన్ చౌదరి, సూరజ్ చౌదరిని పట్టుకుని కేసు నమోదు చేశారు. నర్సాపూర్ ఎక్సైజ్ సీఐ పద్మ ఆదేశాల మేరకు మనోహరాబాద్ తహసీల్దార్ వద్ద వారిని బైండోవర్ చేశారు.

◆ కారులోని వస్తువులు చోరీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజీపేట గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారులోని వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని కారు యజమాని శుక్రవారం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. బుధవారం మెదక్ మండలం కోంటూర్ గ్రామానికి చెందిన పున్న రమేష్ స్విఫ్ట్ కారులో హైదారాబాద్ బయలుదేరాడు. అంబాజీపేట వద్ద కారు, బైక్ ఢీ కొనడంతో వాహనాలు దెబ్బతిన్నాయి. దీంతో కారును రోడ్డు పక్కన పార్క్ చేశారు. కారుకు మరమ్మతులు చేయించేందుకు శుక్రవారం వచ్చి చూడగా కారులోని బ్యాటరీ, డిస్‌ప్లే, సౌండ్‌సిస్టం అపహరించినట్లు కారు యజమాని చిన్నశంకరంపేట పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణ తెలిపారు.

కారు యజమానిపై కేసు నమోదు

మండలంలోని అంబాజీపేటలో బుధవారం కారు బైక్ ఢీ కొన్న సంఘటనలో కారు యజమానిపై కేసు నమోదు చేసినట్లు చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణ తెలిపారు. మండలంలోని అంబాజీపేట గ్రామానికి చెందిన చాకలి మధు పొలానికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా కోంటూర్ గ్రామానికి చెందిన కారు యజమాని పున్న రమేశ్ నిర్లక్ష్యంగా డ్రైవ్ చేసి బైక్‌ను ఢీ కొట్టినట్లు మధు తల్లి వెంకమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించొచ్చు

మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

నర్సాపూర్ రూరల్: ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించొచ్చని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా నర్సాపూర్ మున్సిపల్ వద్ద పట్టణ దావాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించి మురళీధర్ యాదవ్ మాట్లాడారు. మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఇందుకు ప్రతీ ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో పారిశుద్ధ్య కార్మికులతోపాటు మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాలకృష్ణ, కౌన్సిలర్లు బుచేష్ యాదవ్, గోడ రాజేందర్, సంగసాని సురేష్, పంబల రామచందర్, పంబల లలిత, చెలిమేటి లక్ష్మి, సరితా పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

నర్సాపూర్ మున్సిపల్ సర్వసభ సమావేశం శుక్రవారం జరగవలసి ఉండగా వాయిదా వేశారు. మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్‌కు అత్యవసర పనిఉన్నందున వాయిదా వేసినట్లు తెలిసింది.

స్వచ్ఛతతోనే వ్యాధులు దూరం

మనోహరాబాద్(తూప్రాన్): స్వచ్ఛత పాటిస్తే వ్యాధులు దరిచేరవని ప్రజాప్రతినిధులు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వీధులను శుభ్రం చేశారు. కోనాయపల్లి(పీటి)లో సర్పంచ్ ప్రభావతి ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామ కార్యదర్శి నవీన్ గ్రామస్తులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట గ్రామంలో సర్పంచ్ స్వర్ణలత భాగ్యరాజ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో గ్రామంలోని మురికి కాలువలు శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, గ్రామ పంచాయతీ పాలకవర్గ సిబ్బంది పాల్గొన్నారు.

భిక్షాటన చేసి.. వినతిపత్రాలు ఇచ్చి


నర్సాపూర్‌లో భిక్షాటన చేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు

మెదక్ కలెక్టరేట్: తమ న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ చూపాలని కోరుతూ ఆశా వర్కర్లు శుక్రవారం మెదక్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. పదవీ విరమణ దగ్గరకు వచ్చినా ఉద్యోగ భద్రత, కనీస వేతనం, ప్రభుత్వ సదుపాయాలు అందుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

శివ్వంపేట(నర్సాపూర్): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శివ్వంపేటలో ఆశా వర్కర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి వినతిపత్రం అందజేశారు.

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. అంగన్‌వాడీలు సమ్మె ప్రారంభించి శుక్రవారం నాటికి 19 రోజులు కావస్తుండగా, ఆశా వర్కర్ల ఆందోళన ఐదో రోజుకు చేరింది. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళన విరమించబోమని వారు స్పష్టంచేశారు. ఆశా వర్కర్లు తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

నర్సాపూర్: సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు శుక్రవారం భిక్షాటన చేశారు. నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 19వ రోజుకు చేరిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజు తెలిపారు. 19 రోజులుగా అంగన్‌వాడీ సిబ్బంది నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా పట్టణంలో భిక్షాటన చేసినట్లు తెలిపారు. సమ్మెతో పాటు భిక్షాటనలో సీఐటీయూ నాయకులతో పాటు అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ ఆంజనేయులుకు శుక్రవారం వినతి పత్రం అందచేశారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

లంబోదరుడికి వీడ్కోలు


ర్యాలమడుగులో వినాయక నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న యువకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో శుక్రవారం దొడ్డి ముందటి గణేశ్ మండప నిర్వాహకులు శుక్రవారం గణేశ్ లడ్డూ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన కుమ్మరి సతీష్ రూ 85,116లకు, అలాగే బాల గణేశ్ లడ్డూను గౌండ్ల రాజుగౌడ్ రూ. 36 వేలకు దక్కించుకున్నారు. వినాయక నిమజ్జన శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. శోభాయాత్రలో మహిళల కోలాటం, డీజే ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కౌడిపల్లిలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో శ్రీ వినాయక ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపంలో గణనాథుడికి పూజా కార్యక్రమాలు, భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు సతీశ్ చారి, మాజీ వార్డు సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం వినాయక నిమజ్జనోత్సవం నిర్వహించారు. పలు వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు.

నర్సాపూర్ రూరల్: కులమతాలకతీతంగా గణేశ్ మండపం వద్ద అన్నదానం చేయడం అభినందనీయమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం నర్సాపూర్ 3వ వార్డు కౌన్సిలర్ ఇస్రాత్ సిద్ధికి, దావుద్ ఆధ్వర్యంలో ఎన్జీఓ కాలనీ సాయిబాబా ఆలయం ఆవరణలో ఏర్పాటుచేసిన గణేశ్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ హాజరై వినాయకుడికి పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.


మల్కాపూర్‌లోని వినాయక మండపంలో పూజలు చేస్తున్న నాయకులు


వెల్మకన్నలో వినాయక శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు

లాభాలబాటలో పీఏసీఎస్ సొసైటీ

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం లాభాలబాటలో కొనసాగుతోందని సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి తెలిపారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో అర్ధ వార్షిక మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ నుంచి ఆగస్టు చివరి నాటికి సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, సమకూరిన ఆదాయం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో వైస్ చైర్మన్ మురళి, డైరెక్టర్‌లు కృష్ణాగౌడ్, పోతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సొసైటీ సీఈఓ సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.